క్లుప్తంగా

చిన్నారుల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం తగదు



ప్రత్తిపాడు: చిన్నారుల్లో వయసుకు తగిన బరువు ఉండాలని అప్పుడే ఆరోగ్యంగా ఉన్నట్లుగా భావించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.అరుణ అన్నారు. పోషణ్ పఖ్వాడా కార్యక్రమంలో భాగంగా గురువారం ప్రత్తిపాడు యాదవపాలెం అంగన్‌వాడీ కేంద్రంతో పాటు గొట్టిపాడు సెక్టార్‌లోని తిక్కిరెడ్డిపాలెం కేంద్రాల్లో గర్భవతులు, బాలింతలు, మహిళలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించే గ్రోత్ మోనిటరింగ్‌పై తల్లులకు వివరించారు. ఆయా కార్యక్రమాల్లో సూపర్‌వైజర్ ఎంవీ.రత్నం, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎన్ సుభాషిణి, కె.శ్రీదేవి, నాసరమ్మ, మహిళలు పాల్గొన్నారు.

ఎథికల్ స్టెప్స్‌పై విద్యార్థినులకు అవగాహన



ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట మలినేని లక్ష్మయ్య ఉమెన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఐటీ విద్యార్థినులకు హక్ బోట్స్ ఆధ్వర్యంలో స్టార్ట్ అప్ ప్లానింగ్, లీగల్, ఎథికల్ స్టెప్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హక్‌బోట్స్ సీఈవో ఎస్ఆర్‌కే మహాస్, స్టార్టప్ ఐడియాస్ నిపుణుడు టి.ప్రసాద్‌లు హాజరయ్యారు. ప్రోడక్ట్ ఇన్నోవేషన్స్, మ్యానుఫ్యాక్చర్ లెవల్స్, ఇన్వెస్ట్‌మెంట్ లెవల్స్, క్రియేటివ్ ఇన్నోవేషన్స్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ వంటి అంశాలపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మలినేని పెరుమాళ్లు, ప్రిన్సిపల్ జె. అప్పారావు, డీన్ కిషోర్‌బాబు, రమేష్‌బాబు, ఆయా విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించండి



గరికపాడు(కాకుమాను): త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించే విధంగా మండల ప్రజలంతా సహకరించాలని ప్రత్తిపాడు సీఐ నిసార్ భాష కోరారు. మండలంలోని గరికపాడు, బీకేపాలెం, కొండపాటూరు గ్రామాలలో గురువారం పోలీస్ బెటాలియన్‌తో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా నిసార్ భాష మాట్లాడుతూ రానున్న ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో ఎలాంటి అల్లర్లు, అలజడులు లేకుండా నిర్వహించడమే లక్ష్యమని చెప్పారు. పోలీస్ సిబ్బందికి ప్రతి ఒక్కరు సహకరించి ప్రశాంత ఎన్నికల నిర్వహణకు సహకరించాలని ఆయన కోరారు. ఎన్నికల నిబంధలను అతిక్రమించి అల్లర్లు సృష్టిస్తే అటువంటి వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.కార్యక్రమంలో ఎస్ఐ రవీంద్ర, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేటు ట్రావెల్ బస్సు దగ్ధం



గుంటూరు రూరల్: బస్సులో షార్ట్ సర్క్యూట్ కారణంగా జాతీయ రహదారిపై బస్సు దగ్ధమైన సంఘటన గురువారం రాత్రి నల్లపాడు పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ప్రైవేటు ట్రావెల్స్‌కు చెందిన బస్సు విజయవాడ నుంచి బెంగుళూరు వెళుతుండగా ఎన్‌హెచ్-16 వైజంక్షన్ వద్ద ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. గమనించిన బస్సు డ్రైవర్ బస్సును పక్కన ఆపి ప్రయాణికులను కిందకు దించారు. బస్సు పూర్తిగా మంటల్లో దగ్ధమైంది. ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పారు. ప్రయాణీకులకు ఎలాంటి ప్రమాదం జరుగక పోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. బస్సులో 60 మంది ప్రయాణికులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై నల్లపాడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం విక్రేత అరెస్ట్

గుంటూరు ఈస్ట్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంజనేయపేట 1వ లైనులో దర్శి నాగచైతన్య తెలంగాణ మద్యం విక్రయిస్తున్నాడన్న సమాచారంతో పోలీసులు దాడిచేశారు. నాగచైతన్యను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అతని నుంచి 14 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వలంటీర్, సచివాలయ వ్యవస్థతో సుస్థిర పాలన

వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ



సభలో మాట్లాడుతున్న సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు సంక్షేమం అందుతుందని వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. గతంలో టీడీపీ ప్రవేశపెట్టిన జన్మభూమి కమిటీలతో ఆ పార్టీ పతనం మొదలైందని పేర్కొన్నారు. గురువారం నిడుబ్రోలులోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఆయన హాజరయ్యారు. సభకు పార్టీ నాయకులు నన్నపనేని అంకినీడు చౌదరి అధ్యక్షత వహించారు. ముందుగా మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, పొన్నూరు మాజీ ఎమ్మెల్యే చిట్టినేని వెంకట్రావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నూతన పాలకవర్గ చైర్మన్ రావిపాటి మురళీకృష్ణ, పాలకవర్గ సభ్యులు కొండముది కమలాకర్ రావు, షేక్ సైదా ప్రమాణం చేశారు. సమన్వయకర్త మురళీకృష్ణ మాట్లాడుతూ 2023వ సంవత్సరంలో రూ.45 కోట్లు రుణాలు ఇచ్చిన నిడుబ్రోలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు కర్లపూడి రమేష్, ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు బొనిగల వేణు ప్రసాద్, బొద్దులూరి రంగారావు, వడ్రాణం ప్రసాదరావు, షేక్ నాజర్, కోట శ్రీనివాసరావు, పెరికల కృష్ణమోహన్, భవనం వంశీ రెడ్డి, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం గుంటూరు జిల్లా సేవాదళ్ కార్యదర్శిగా నియమితులైన వేముల మూర్తి రాజు, జిల్లా వికలాంగుల విభాగ కార్యదర్శిగా నియమితులైన కాట్రగడ్డ విజయకుమార్‌లను పొన్నూరు మురళీకృష్ణ సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

మంచి చేసే ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

పొన్నూరు: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మరోసారి అధికారం అందించేలా ఆశీర్వదించాలని వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ కోరారు. గురువారం పట్టణంలోని పార్టీ ముఖ్య నాయకులతో ఆత్మీయ సమావేశాలను నిర్వహించారు. మురళీకృష్ణ పలువురు నాయకుల ఇంటికి వెళ్లడంతో వారు ఆత్మీయంగా ఆహ్వానం పలికారు. పార్టీ ముఖ్య నాయకులు సహస్ర లింగేశ్వర స్వామి ఆలయ మాజీ చైర్మన్ నాగ సూరి ప్రతాప్, మాజీ కౌన్సిలర్ మహమ్మద్ జిలాని, ఆడిటర్ పులిపాక వెంకట సత్యసాయి వరప్రసాద్, పఠాన్ బాబు ఖాన్ లను కలిశారు. నాలుగో వార్డ్‌లోని మటన్ మార్కెట్‌లో మటన్ కొట్టి వ్యాపారులతో సందడి చేశారు. సంక్షేమ పాలన సాగిస్తున్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, వైఎస్ఆర్ సీపీ నాయకులు షేక్ నాజర్, వడ్రాణం ప్రసాదరావు, కోటా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో సేవకులకు గుర్తింపు



అనిల కుమారిని సత్కరిస్తున్న అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ ప్రభుత్వంలో అంకిత భావంతో పని చేసే ప్రతి ఒక్కరికీ ప్రాధాన్యముంటుందని వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గం సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. పొన్నూరు నియోజకవర్గంలోని ముఖ్య నాయకులకు పార్టీ అధిష్టానం జిల్లా స్థాయి పదవులను కేటాయించింది. పదవులు పొందిన వారిని సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆత్మీయంగా పలకరించి అభినందనలు తెలిపారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా నియమితులైన పార్టీ సీనియర్ నాయకురాలు మూకిరి అనిల కుమారిని ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆర్‌వీఆర్‌జేసీకి డీఆర్‌డీఓ నూతన ప్రాజెక్టు



డాక్టర్ రేణుకను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: భారత రక్షణ శాఖను సాంకేతికతతో శక్తివంతం చేయడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న డీఆర్‌డీఓ సంస్థకు తమ కళాశాల రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం తోడ్పాటు నందించేందుకు నూతన ప్రాజెక్ట్ మంజూరు చేస్తూ నిధులు కేటాయించడం గర్వ కారణమని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్ అన్నారు. గురువారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ లోలైట్, నైట్ లైట్లలో సీసీ కెమెరాలలో చిత్రీకరణ అయ్యే వీడియోలను మార్చి నాణ్యతతో కూడిన స్పష్టమైన వీడియో దృశ్యాలను అందించే రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ విభాగం ద్వారా పరిశోధన జరిపిన కళాశాల ఈసీ విభాగ అధ్యాపకురాలు డాక్టర్ రేణుకకు ప్రాజెక్ట్ అనుమతులు మంజూరు చేస్తూ రూ 9.5లక్షల నిధులు కేటాయించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్టుకు అనుమతి పొందిన డాక్టర్ రేణుకను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ టి రంగబాబు తదితరులు పాల్గొన్నారు.

సిబార్ దంత వైద్య కళాశాలకు న్యాక్ గుర్తింపు



తక్కెళ్లపాడు సిబార్ దంత వైద్య కళాశాల

పెదకాకాని: సిబార్ దంత వైద్య కళాశాలకు నేషనల్ అస్సెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్(ఎన్ఏఏసీ) భారత ప్రభుత్వ సంస్థచే న్యాక్ ఏ గుర్తింపు లభించినట్లు కళాశాల డీన్ డాక్టర్ ఎల్ కృష్ణప్రసాద్ చెప్పారు. పెదకాకాని మండలంలోని తక్కెళ్ళపాడు దంత వైద్య కళాశాలలో గురువారం కళాశాల డీన్ డాక్టర్ ఎల్ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ మొదటి ప్రయత్నంలోనే న్యాక్ ఏ ప్లస్ గుర్తింపు సాధించి దేశంలోనే అతి కొద్ది దంత వైద్య కళాశాలల సరసన చేరడం గర్వించదగిన విషయమన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనే న్యాక్ ఏ ప్లస్ గుర్తింపు పొందిన తొలి కళాశాల కావడం హర్షించదగినదన్నారు. జనవరి నెలలో జరిగిన న్యాక్ తనిఖీల్లో నవీన పద్ధతుల్లో అత్యుత్తమ విద్యా బోధన, అధునాతన దంత వైద్య పద్ధతులు, దంత వైద్య పరిశోధనలు, సామాజిక దంత వైద్య శిబిరాల నిర్వహణ మొదలగు అంశాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరచి సిబార్ దంత వైద్య కళాశాల ఈ ఘనతను సాధించిందన్నారు. అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులను అభినందించారు. ఈ గుర్తింపుతో రాబోయే రోజుల్లో సిబార్ దంత వైద్య కళాశాలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వివిధ కళాశాలలు, విశ్వ విద్యాలయాలతో కలసి సంయుక్త పరిశోధనలు, దంత వైద్య విద్యలో నూతన ఒరవడులు మొదలగు అంశాలపై పనిచేసే అవకాశం లభిస్తుందని కళాశాల డీన్ డాక్టర్ ఎల్ కృష్ణప్రసాద్ తెలిపారు.

ప్రణాళికాబద్ధంగా విధులు నిర్వహించాలి

- నగర కమిషనర్, తూర్పు ఈఆర్వో కీర్తి చేకూరి
- మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ బృందాలతో సమీక్ష సమావేశం



అధికారులతో సమావేశమైన కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేయటానికి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ టీంలు (ఎంసీసీ) ప్రణాళికాబద్ధంగా విధులు నిర్వహించాల్సి ఉంటుందని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్వో కీర్తి చేకూరి అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలుపై గురువారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో మాస్టర్ ట్రైనర్ల ద్వారా పట్టణ ప్రణాళిక అధికారులు, ప్లానింగ్ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రవర్తన నియమావళి పకడ్బందీగా అమలు చేయాలన్నారు. కోడ్ వచ్చిన వెంటనే ఎంసీసీ బృందం విధుల్లో ఉండాలని, రాజకీయ పార్టీల పోస్టర్స్, బ్యానర్స్, హోర్డింగ్స్, బోర్డులను తక్షణం తొలగించాల్సి ఉంటుందన్నారు. ప్రింటింగ్ ప్రెస్ పేరు, అభ్యర్థి, పార్టీ పేర్లు లేకుండా పోస్టర్స్, బ్యానర్స్ ప్రింట్ చేస్తే వాటిని సీజ్ చేయాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలు, పార్టీలు, అభ్యర్థుల ఖర్చులు, అనధికారికంగా తరలించే మద్యం, నగదు, బహుమతులను అరికట్టేందుకు పూర్తి సన్నద్ధతతో ఉండాలని స్పష్టం చేశారు. షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి ప్రతి రోజు ఎన్నికల సంఘం నిర్దేశించిన పద్ధతిలో వివరాలను రిటర్నింగ్ అధికారికి అందించాలన్నారు. ఒక్కో టీంకు పట్టణ ప్రణాళిక అధికారులు, ప్లానింగ్ కార్యదర్శి, దళం సభ్యులను కేటాయిస్తూ ఆదేశాలు ఇవ్వాలని ఏఈఆర్‌ఓ, సిటీ ప్లానర్‌ని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఈఆర్‌ఓలు ప్రదీప్ కుమార్, శేషన్న, మాస్టర్ ట్రైనీలు, ఎంసీసీ విధులు కేటాయించబడిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కారించాలి

గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల వారీగా ఓటర్ల జాబితాపై అందిన అర్జీలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కారించాలని, ఇందుకు బీఎల్‌ఓలు, సూపర్వైజరీలు పూర్తి బాధ్యత తీసుకోవాలని ఈఆర్‌ఓ కీర్తి చేకూరి ఆదేశించారు. తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో ఓటర్ల జాబితాపై అందిన ఫిర్యాదులు, అర్జీల పరిష్కారంపై సూపర్వైజరీ అధికారులతో తన చాంబర్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఓటర్ల జాబితాపై అందిన అర్జీలను వెంటనే పరిష్కారించాలని, బీఎల్‌ఓల వారీగా పెండింగ్ వివరాలను సూపర్వైజరీ అధికారులు సమీక్షించి, క్షేత్రస్థాయి పరిశీలన చేసి చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల విధుల్లోని కంప్యూటర్ ఆపరేటర్లు తమకు సూపర్వైజరీ అధికారుల సంతకాలతో అందిన అర్జీలను ఏఈఆర్‌ఓ, ఆర్‌ఓ దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఎన్నికల విభాగ సూపరింటెండెంట్లు సూపర్వైజరీ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు.

ఆరోగ్య సురక్ష ద్వారా ఆరోగ్య భద్రత

గుంటూరు రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల ఆరోగ్యానికి భద్రత కల్పించిన నాయకుడు జగనన్న అని 26వ డివిజన్ కార్పొరేటర్ శ్యామల వెంకట రమణాదేవి తెలిపారు. గురువారం డివిజన్ పరిధిలోని దాసరిపాలెం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. చౌడవరం, దాసరిపాలెం చౌడవరం చక్క తదితర ప్రాంతాల ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

చిన్నారులకు పోషకాహారం అందివ్వాలి

బీకేపాలెం(కాకుమాను): తల్లిదండ్రులు తమ చిన్నారులకు చిన్న వయసు నుంచే మంచి పోషక విలువలు కలిగిన ఆహారం అందించాలని ఐసీడీఎస్ పాంద్రపాడు సెక్టార్ సూపర్ వైజర్ వెంకాయమ్మ అన్నారు. పోషణ పఖ్వాడ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని బీకేపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషకాహారంపై తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.అంగన్‌వాడీ కేంద్రాలలో ఇచ్చే పోషకాహారంతో పాటు ఇంటి వద్ద కూడా చిరుధాన్యాలు, ఆకు కూరలతో చేసిన వంటలను అందించాలని ఆమె తెలిపారు.కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, తల్లి దండ్రులు, చిన్నారులు పాల్గొన్నారు.

సింగిల్ నంబరు ఆట నిర్వాహకుడి అరెస్టు

గుంటూరు ఈస్ట్ : సింగిల్ నంబరు ఆట నిర్వహిస్తున్న వ్యక్తిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అరండల్‌పేట 14వ లైనులో దాసరి సత్యనారాయణ సింగిల్ నంబరు ఆట నిర్వహిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు గురువారం అతనిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అతని నుంచి రూ. 1,350లు నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు.

ఉద్యోగం ఆశ చూపి డబ్బులు వసూలు

గుంటూరు ఈస్ట్: ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన ఇద్దరిపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. ఉద్యోగనగర్‌లో నివసించే కె.సతీష్‌కుమార్‌కు చిలకలూరిపేటకు చెందిన సయ్యద్ హసన్ అలీ, వెంకట్ కోర్టులో ఉద్యోగం ఇప్పిస్తామని మోసం చేసి రూ.5 లక్షలు తీసుకున్నారు. ఉద్యోగం ఇప్పించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు గురువారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

లేపాక్షి ఎంపోరియంలో డిస్కౌంట్ అమ్మకాలు

నగరంపాలెం: స్థానిక బ్రాడిపేటలోని లేపాక్షి హస్తకళల ఎంపోరియంలో క్లియరెన్స్ సేల్ సందర్భంగా ఎంపిక చేసిన వస్తువులపై డిస్కౌంట్ అమ్మకాలు నిర్వహిస్తున్నట్లు మేనేజర్ ఎం.వి. ఎన్.కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వస్తువులపై 10 నుంచి 40 శాతం వరకు రాయితీ అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నెల 31 వరకు రాయితీ ఉంటుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

3,4 తేదీల్లో జేకేసీ కళాశాలలో జాతీయస్థాయి సదస్సు

గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాలలో ఏప్రిల్ 3, 4వ తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఐ. నాగేశ్వరరావు తెలిపారు. గురువారం జేకేసీ కళాశాలలో సదస్సు బ్రోచర్ ఆవిష్కరించారు. ప్రిన్సిపల్ నాగేశ్వరరావు మాట్లాడుతూ "ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఇన్ కంప్యూటర్ సైన్స్" అనే అంశంపై నిర్వహిస్తున్న సదస్సులో భాగంగా పీజీ, పరిశోధక విద్యార్థులు, అధ్యాపకులు, ఐటీ నిపుణులు తమ నూతన ఆవిష్కరణలను సమర్పించవచ్చునని తెలిపారు. కంప్యూటర్ సైన్స్‌పై సైబర్ సెక్యూరిటీ, డీప్ లెర్నింగ్, బిగ్‌డేటా ఎనలిటిక్, డేటా మైనింగ్, ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్, క్లౌడ్ కంప్యూటింగ్, రీసెంట్ అడ్వాన్స్‌మెంట్స్‌పై చర్చిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ జె. మురళీమోహన్, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్ఆర్కే ప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ పి. గోపీచంద్, సదస్సు కన్వీనర్ వై. సురేష్‌బాబు, కో-కన్వీనర్ వై. వెంకటేశ్వరరావు, ఐక్యూఏసీ సమన్వయకర్త బాల నరేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి తొలి ప్రాధాన్యం



పెదకాకానిలో చేయూత నమూనా చెక్కు అందజేస్తున్న శ్రీనివాసరావు

పెదకాకాని: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు అన్నారు. పెదకాకాని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వైఎస్సార్ చేయూత నమూనా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అక్క చెల్లెమ్మలకు ఆర్థికంగా అండగా నిలబడేందుకు వైఎస్సార్ చేయూత పథకాన్ని ప్రారంభించిందన్నారు. రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడంతో పాటు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలన్నారు. అనంతరం లబ్ధిదారులకు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ళ జ్యోతి, సర్పంచి గోళ్ళ స్వరాజ్యలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు షేక్ షహనాజ్, మండల సమాఖ్య అధ్యక్షురాలు అరుణ, డ్వాక్రా ఏపీఎం రాజు, వివోఏలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

చిప్ డిజైనింగ్‌లో విద్యార్థులకు విస్తృత అవకాశాలు

బ్రాడ్‌కామ్ సంస్థ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఇంజినీర్ వంశీగోపాల్ వాసిరెడ్డి



నంబూరు వీవీఐటీలో అధ్యాపకులు, విద్యార్థులతో వంశీగోపాల్ వాసిరెడ్డి

పెదకాకాని: వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగం, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియా విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో 'డిజైన్ సింథసిస్ అండ్ పవర్ ఎస్టిమేషన్' అంశంపై సదస్సు నిర్వహించారు. నంబూరు వీవీఐటీలో గురువారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా అమెరికాకు చెందిన బ్రాడ్‌కామ్ సంస్థ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఇంజినీర్ వంశీగోపాల్ వాసిరెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ చిప్‌ల తయారీ రంగంలో విస్తృత అవకాశాలు ఉన్నాయన్నారు. స్మార్ట్ వెహికల్స్, ఎలక్ట్రికల్ వెహికల్స్ నందు చిప్‌ల వినియోగం అధికంగా ఉందన్నారు. అధిక ఉష్ణోగ్రత గల ప్రాంతాలలో చిప్‌ల పనితీరు ఏ విధంగా ఉంటుందో విద్యార్థులకు వివరించారు. ఎలక్ట్రికల్ విభాగానికి చెందిన విద్యార్థులకు విదేశాలలో చిప్ డిజైనింగ్, ఎంబైడెడ్ సిస్టమ్స్, వీఎల్ఎస్ఐ డిజైన్ రంగాలలో మంచి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు వాటిపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ వై మల్లికార్జునరెడ్డి, అకడమిక్ డీన్ డాక్టర్ కె గిరిబాబు, ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ ఏవీ నరేష్‌బాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



చెక్కులు అందుకున్న వారితో బలసాని

గుంటూరు రూరల్: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన సాగిస్తున్నారని ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం ఏటుకూరులోని నియోజకవర్గ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజారోగ్య భద్రత కోసం జగనన్న ఆరోగ్య సురక్ష, విలేజ్ క్లినిక్‌లు, ఆరోగ్యశ్రీ పరిధిని రూ.25 లక్షలకు పెంచిన ఏకైక నాయకుడు జగనన్న అని తెలిపారు. ఆరోగ్యశ్రీలో 2వేల రకాల వ్యాధులకు వైద్యం అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమేనని అన్నారు. విద్య, వైద్య రంగాల్లో పెనుమార్పులు తెచ్చి ప్రపంచంలో ఆంధ్రప్రదేశ్‌ను ప్రత్యేక స్థానంలో నిలిపిన నాయకుడిగా జగనన్న నిలిచిపోతారన్నారు. రానున్న ఎన్నికల్లో ఆయనకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను బాధితులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం చూపాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

కాకుమాను: వేసవికాలంలో మండలంలోని ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా సంబంధిత అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాలలో ట్యాంకర్ల ద్వారా ప్రతి రోజు నీటిని సరఫరా చేసి తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఆయన తెలిపారు. మండలంలోని గ్రామాలలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రతి అధికారి కృషి చేయాలని ఆయన కోరారు.ఈ సందర్భంగా శాఖల వారీగా ఇప్పటి వరకు మండలంలో జరిగిన అభివృద్ధి పనులతో పాటు చేపట్టవలసిన పనులపై చర్చించారు. సమావేశంలో సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు వింతా రాఘవరెడ్డి, ఉపాధ్యక్షుడు దేవిరెడ్డి సాంబయ్య, మండల ఉపాధ్యక్షులు పెదపూడి కపిల్, తియ్యగూర వెంకటరెడ్డి, ఎంపీడీఓ పి.రామకృష్ణ, సీడీపీఓ సుజాత, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో రైతులకు మేలు

గుంటూరు రూరల్: విస్తరణ శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో రైతుల అభివృద్ధికి మేలైన వ్యవసాయ యాజమాన్య కార్యక్రమాలను చేపట్టాలని విస్తరణ సంచాలకురాలు డాక్టర్ విజయాభినందన తెలిపారు. గురువారం నగర శివారుల్లోని లాంఫాం నందున్న ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం సమావేశ మందిరంలో ఏరువాక కేంద్రం జిల్లా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శాస్త్రవేత్తలు రూపొందించిన ప్రతి టెక్నాలజీ రైతులకు చేరాలని సూచించారు. సహ పరిశోధన సంచాలకురాలు డాక్టర్ శ్రీలక్ష్మి మాట్లాడుతూ రైతు వారీ పద్ధతులను క్షుణ్ణంగా తెలుసుకుని క్షేత్రస్థాయిలో సమస్యలకు అనుగుణంగా సూచనలు చేయాలని తెలిపారు. డీఏవో ఈ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువుల వినియోగం, జీవన ఎరువుల వినియోగంపై అవగాహన పెంపొందించాలని పంట వ్యర్థాల వినియోగంపై పరిశీనా క్షేత్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ బి కిషోర్‌బాబు 2023-24 సంవత్సరంలో నిర్వహించిన వివిధ కార్యక్రమాలను వాటి ఫలితాలను వివరించారు. కార్యక్రమంలో డీడీఏ డాక్టర్ రామాంజనేయులు, వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై వేధింపులను అరికట్టాలి

పెదకాకాని: పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నివారణకు కమిటీ వేయాలని జిల్లా సీఐటీయూ కార్యదర్శి నన్నపనేని శివాజీ అన్నారు. మండలంలోని వెనిగండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ సభకు సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు కె అన్నమ్మ అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నేడు మహిళలు సమాజంలో సగం ఉన్నా చట్టసభలలో వారికి తగిన ప్రాతినిధ్యం కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు. పని ప్రదేశాలలో పురుషులతో సమానంగా వేతనాలు ఇవ్వకుండా వివక్షత చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీవోఏ జిల్లా నాయకులు వి విజయలక్ష్మి మాట్లాడుతూ పని ప్రదేశాలలో లైంగిక వేధింపుల నివారణకు కమిటీలు వేయాలని నిర్ణయించినా ఇంత వరకు కార్యరూపం దాల్చలేదని దీంతో మహిళలు చెప్పుకోలేని విధంగా ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. సభలో ప్రతినిధులు అరుణ, సుజాత, ప్రభావతి, కమల, శివకుమారి, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.